క్లుప్తంగా

సంక్రాంతి రంగుల హరివిల్లు



ప్రత్తిపాడు: గ్రామాల్లో సంక్రాంతి సందడి షురూ అయ్యింది. ప్రత్తిపాడులోని రెడ్ల రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆకాశంలోని హరివిల్లు నేలకు వాలిందా అన్నట్లుగా భోగి పర్వదినాన రంగురంగుల సంక్రాంతి రంగవల్లులను సుందరంగా తీర్చిదిద్దారు. పోటీల్లో మహిళలు ఉల్లాసంగా పాల్గొని ముగ్గులను తీర్చిదిద్దారు.

ఘనంగా శివముక్కోటి వేడుకలు



చేబ్రోలు: ఖ్యాతి గాంచిన చేబ్రోలులోని నాగేశ్వర స్వామి, భీమేశ్వర స్వామి దేవస్థానాల్లో శివ ముక్కోటి ఏకాదశి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. శివముక్కోటి సందర్భంగా గంగాపార్వతి సమేత నాగేశ్వర స్వామి, భీమేశ్వరస్వామి దేవస్థానాల్లో ఆరుద్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. దక్షిణ ద్వారదర్శనం కోసం భక్తులు తెల్లవారుజామున అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. దక్షిణం వైపున ఉన్న ద్వారం నుంచి వెళ్లి స్వామివారిని దర్శించుకోవటం అత్యంత పుణ్యప్రదంగా భక్తులు భావించి దర్శించుకున్నారు. ప్రత్యేకాలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవం.. గోదా రంగనాథ స్వామి కల్యాణం



ప్రత్తిపాడు: మండల కేంద్రం పెదనందిపాడులో కొలువుదీరిన శ్రీ రుక్మిణి సత్యభామసమేత వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి రంగనాథ స్వామి వార్ల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంతం మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో వేదాంతం అనంతచార్యులు, భాగవతుల లక్ష్మీనారాయణచార్యులు స్వామి వార్ల కల్యాణాన్ని కనుల పండువగా శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ నిర్వహించారు. దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. తలంబ్రాల కార్యక్రమాన్ని భక్తజనులు, గ్రామస్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రారంభం



పొన్నూరు: పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ 23వ ద్వితీయ శ్రేణి కంటి వైద్య కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, నాట్కో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, నాట్కో ఫార్మా లిమిటెడ్ సీఎస్ఆర్ అధిపతి కంటమణి స్వాతి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నేత్ర వైద్య కేంద్రం నాట్కో ట్రస్ట్ సహకారంతో నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు నేత్ర వైద్యాన్ని అందిస్తుందని తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బందితో కంటి వైద్య సేవలను అందించనున్నట్లు వెల్లడించారు. నాట్కో ఫార్మా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ సీఎస్ఆర్ మేనేజర్ వంశీకృష్ణ, ఆనంద్ బాబు, డాక్టర్ రాజీవ్ రెడ్డి, వైస్ ఛైర్మన్ డాక్టర్ రోహిత్ కన్నా, నెట్‌వర్క్ డైరెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చేబ్రోలులో కర్పూర జ్యోతి దర్శనం

చేబ్రోలు: చేబ్రోలులోని చారిత్రక ప్రసిద్ధి చెందిన నాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద అయ్యప్ప స్వామి వారి మకర విళక్కు సందర్భంగా మంగళవారం రాత్రి కర్పూర జ్యోతి దర్శనం కోసం అయ్యప్పస్వామి భక్త బృందం ఏర్పాట్లు చేశారు. స్థానిక గాలిగోపురం వద్ద గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద కర్పూర దర్శన కార్యక్రమం జరుగుతుందని గురుస్వామి ఉదయగిరి శ్రీనివాసరావు స్వామి సోమవారం తెలిపారు. ఆలయంలోని అయ్యప్పస్వామి విగ్రహానికి పూజలు చేసిన అనంతరం భక్తులకు కర్పూర జ్యోతి దర్శనం కల్పిస్తున్నట్లు గురుస్వామి తెలిపారు.

భోగి మంటలు.. భోగభాగ్యాలు

- తెలతెలవారకముందే ఎగసిపడ్డ భోగి మంటలు
- వీధివీధినా భోగి కాంతులే
- చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వచనాలు

ప్రత్తిపాడు: తెల్లవారకముందే పల్లె నిద్రలేచింది. మండలంలో భోగి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల నడుమ అట్టహాసంగా జరుపుకొన్నారు. తూర్పున భానుడు ఉదయించక ముందే సోమవారం గ్రామాల్లోని వీధులన్నీ భోగిమంటల ఎర్రని కాంతులతో దేదీప్యమానంగా దర్శనమిచ్చాయి. భోగి మంటలకు ఒక రోజు ముందుగానే సిద్ధం చేసుకున్న తాటాకులు, అట్టపెట్టెలు, కట్టెలు, చెత్త మోపులను తగులబెడుతూ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భోగి మంటలు వేసి సందడి చేశారు. యువత రెట్టించిన ఉత్సాహంతో భోగి మంటలు వేశారు. గృహిణులు అమ్మవారిని కొలుస్తూ ధాన్య లక్ష్మికి స్వాగతం పలికారు. సిరులు కురిపించే భూమాతకు పూజలు చేశారు. మహిళలు, యువతులు భోగి పండుగను పురస్కరించుకుని తమతమ గృహాల ముంగిట పెద్ద పెద్ద రంగవల్లికలు, రంగులతో తీర్చి దిద్ది గొబ్బెమ్మలను అందులో ఉంచారు. హరిలోరంగ హరి అంటూ.. వేణుగాన కీర్తనలతో లోగిలి ముంగిటకు వచ్చిన హరిదాసుడు గొబ్బెమ్మలను తొక్కి సంప్రదాయాన్ని చాటారు. యువతీ, యువకులు రెట్టించిన ఉత్సాహంతో భోగి మంటల వేడుకలను నిర్వహించారు.

చిన్నారులకు భోగిపళ్లు..

భోగి పర్వదినంను పురస్కరించుకుని చిన్నారులకు భోగిపళ్లు పోసే వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తలపై రేగిపళ్లు, పూలు, డబ్బులు, శనగలు కలిపిన భోగిపళ్లు పోస్తూ తల్లిదండ్రులు ఆనందడోలికల్లో తేలియాడారు. ఈ సందర్భంగా చిన్నారులను అష్ట ఐశ్వర్యాలు, భోగ భాగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని కోరుకుంటూ చిన్నారుల శిరస్సుపై భోగి పళ్ళు పోసి ఆశీర్వచనాలను అందజేశారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

ప్రత్తిపాడు: స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం భోగి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి వారికి భోగి పళ్లు పోసి కనుల పండువగా వేడుకను నిర్వహించారు. వేకువజామునే మహిళలు పెద్ద ఎత్తున దేవాలయానికి తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధనుర్మాసంను పురస్కరించుకుని మండలంలోని రామాలయాలు, వేణుగోపాల స్వామి, శైవ క్షేత్రాలలో గత నెల రోజులుగా ధనుర్మాస ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. భోగి నేపథ్యంలో మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జూనంచుండూరులోని శ్రీ సమ్మోహన వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు తమిరిశ రామశేషాచార్యులు, తమిరిశ శ్రీధర్, తమిరిశ ద్విజేంద్రలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్తిపాడులో ఎగసిపడుతున్న భోగి మంటలు



చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో భోగి మంట చుట్టూ గ్రామస్తులు



ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణలో దేవతామూర్తులు

కాకుమానులో...

కాకుమాను: మండలంలో భోగి వేడుకలు సోమవారం వేకువజామునుంచి ప్రారంభమయ్యాయి. తెలతెలవారకముందే లేచి భోగి మంటలు వేసి చిన్నా, పెద్దా అందరూ సందడి చేశారు. చిన్నారులపై భోగిపళ్లు పోసే కార్యక్రమం ఇంటింటా వేడుకగా నిర్వహించారు.

వాడవాడలా భోగి మంటల వెలుగులు

పొన్నూరు: పొన్నూరు ప్రజలు భోగి పండుగను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. భోగి మంటల వెలుగులతో సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వీధుల్లో హరిదాసులు సందడి చేశారు భోగి మంట వద్ద హరినామ సంకీర్తనలు పాడి అందరినీ ఉత్సాహపరిచారు. భోగిమంటల చుట్టూ కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు చేరి సందడి చేశారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలం చింతలపూడి గ్రామంలోని తన నివాసంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ హరిదాసులను సత్కరించారు. పట్టణంలోని బ్రాహ్మణ బజారులో శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానంలో శివ ముక్కోటి సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పూజలో పాల్గొని అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చేబ్రోలులో..

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఉద్యోగ, వ్యాపార, వృత్తి రీత్యా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో స్థిరపడిన వారు పండుగ కోసం స్వగ్రామాలకు చేరుకున్నారు. సోమవారం వేకువజామున ప్రధాన కూడళ్లలో భోగి మంటలను వేశారు. నృత్యాలు చేసి, పాటలు పాడారు. కొత్తరెడ్డిపాలెం గ్రామంలో స్థానికులు ఏర్పాటు చేసిన భోగి మంటల కార్యక్రమంలో వందలమంది స్థానికులు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడి పండుగకు వచ్చిన వారు హాజరయ్యారు.

గొబ్బియళ్లో.. గొబ్బిళ్లో..!

సంక్రాంతికి 'గొబ్బెమ్మలూ' ప్రత్యేకమే!

ప్రత్తిపాడు: సంక్రాంతి అంటేనే గుర్తుకొచ్చేది తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు. హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో గొబ్బెమ్మలకు ప్రత్యేక స్థానం ఉంది. ధనుర్మాసం ప్రారంభమైన నాటి నుంచి ప్రతి ఒక్కరూ వీటిని పూజా కార్యక్రమాల్లో ఉపయోగిస్తారు. ఇంటి ముంగిట రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్ది వాటి మధ్యలో ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను ఉంచడం పూర్వం నుంచి వస్తున్న ఆచారం. గొబ్బెమ్మలకు పసుపు కుంకుములు పెట్టి, వాటి మధ్యలో పుష్పాలు ఉంచి సుందరంగా అలంకరిస్తారు. ముగ్గు మధ్యలో ఐదు లేదా మూడు గొబ్బెమ్మలను ఉంచుతారు. మధ్యలో పెద్ద గొబ్బెమ్మను ఉంచి చుట్టూ చిన్నచిన్న గొబ్బెమ్మలను ఏర్పాటు చేస్తారు. ధనుర్మాసంలో ఇంటి ముంగిట ఉంచిన రంగవల్లులను మధ్యాహ్నం వేళ తీసి గోడకు పిడకలుగా కొడతారు. వీటిని భోగి మంటల్లోనూ, రథసప్తమి నాడు పొంగళ్లకు వాడటం ఆనవాయితీగా సంప్రదాయంగా వస్తుంది. కొత్త ధాన్యంతో చేసిన అటుకులు, బియ్యంతో నివేదిన చేస్తారు. శుబ్బి గొబ్బెమ్మ శుభమునీయవే, తామర పువ్వంటి తమ్ముణ్నియ్యావే.. చామంతి పువ్వంటి చెల్లెల్నీయావే.. అంటూ పాటలు పాడతారు. అంటే కుటుంబమంతా చక్కగా ఉండాలని, అన్ని రకాలైన బంధుత్వాలు మనకు ఉండాలని గీతాలాపన చేస్తారు. అంతేకాదు కొన్ని చోట్ల సాయంత్రాల వేళ సందెగొబ్బెమ్మలనూ తయారు చేస్తారు. గొబ్బెమ్మలను ఇంటి ముంగిటల ఉంచడం వలన లక్ష్మీ దేవి ఇంటికి వస్తుందని పెద్దలు చెబుతున్నారు.



ఇంటి ముంగిట ఏర్పాటు చేసిన గొబ్బెమ్మలు



కాకుమానులో భోగి మంట వద్ద ఓ కుటుంబం



బ్రాహ్మణ బజారులో శ్రీ కృష్ణుడికి పూజలు చేసిన మహిళలు



సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయంలో పూజలు

భోగి మంటల్లో కరెంటు బిల్లులు

- పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలంటూ వినూత్న నిరసన
- భోగి మంటల్లో పెరిగిన కరెంటు చార్జీల బిల్లులు వేసి సీపీఎం, ప్రజాసంఘాల మండిపాటు

ప్రత్తిపాడు: పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని ప్రజలు వినూత్న నిరసన తెలిపారు. భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేసి కూటమి ప్రభుత్వం వెంటనే పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు పెదనందిపాడు మండలం నాగులపాడులో స్థానిక పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటలలో తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్ ధరల పెంపుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమయంలో అదనంగా ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజల మీద మోపుతున్న విద్యుత్ భారాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి ప్రజల మీద భారాలు వేయటం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను వెంటనే ఆపాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు ఎస్.కె మహబూబ్ సుభాని, చెట్టుపల్లి జెరిష్ బాబు, పూల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నాగులపాడులో భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొత్తరెడ్డిపాలెంలో...

చేబ్రోలు: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే ప్రజలపై సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం నాయకులు పల్లా ఆదిశేషు, సీహెచ్ హనుమంతరావు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.16వేల కోట్లు ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభుత్వం భారం మోపిందని దీనిని ఉపసంహరించుకోవాలన్నారు. పల్లా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో ఆరుద్రోత్సవం



పెదకాకాని శివాలయం వద్ద స్వామివార్ల గ్రామోత్సవం



ఆరుద్రోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, చిన్నారులు

పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆరుద్రోత్సవం సందర్భంగా సోమవారం భక్తులు ఉత్తర ద్వారదర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక మహా రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించినారు. ఆరుద్రోత్సవం, భోగి పండుగ సందర్భంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల గ్రామోత్సవం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై కొమ్ముదాసులు, చిన్నారులచే కోలాట భజన, మేళతాళాలతో, బాణసంచా కాల్చుతూ అత్యంత వైభవోపేతంగా పెదకాకాని పుర వీధులలో నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు సోమవారము ఉదయం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ ఎమ్మెల్యేను సత్కరించారు. భోగి పండుగ సందర్భంగా గోపూజ జరిగింది. చిన్నారులకు భోగి పళ్లు పోశారు.

జోరుగా జూదం.. కోడి పందేలు



గుంటూరు రూరల్: సంక్రాంతి సంబరాల పేరిట మండలంలోని పలు గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట, కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. జూదం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జనావాసాల మధ్య నగర శివారు కాలనీలు, అపార్ట్‌మెంట్లలో నిత్యం జూదం జోరుగా సాగుతున్నట్లు సమాచారం. నగరంలోని శివారు ప్రాంతాలైన ఇన్నర్ రింగ్‌రోడ్డు, గోరంట్ల, జొన్నలగడ్డ రోడ్డు, గ్రామ శివారు ప్రాంతాలు, పెదపలకలూరు కొండలు, చినపలకలూరు తోటలు, పేరేచర్ల కొండలు క్వారీలు, వెంగళాయపాలెం, పొత్తూరు, ఓబులునాయుడుపాలెం, కైలాసగిరి ప్రాంతాల్లో, చౌడవరం, ఎన్‌హెచ్ 16 హైవే పరిసర ప్రాంతాల్లో నిత్యం పేకాట(జూదం) జోరుగా సాగుతుంది. అదేవిధంగా కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం. భారీఎత్తున జూదం, కోడి పందేలు జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కోడి పందేలు ఇలా...

కోడి పందేలు గతంలో పండుగలు పర్వదినాల్లో చూసేవారం. కానీ నేడు ప్రతి రోజు పందేలు వేస్తున్నారు. గ్రామాల శివారు ప్రాంతాలు, కొండల్లోని ఖాళీ మైదానాలు పందేలకు నిలయంగా మారాయి. ఒక గంట ఒకచోట నిర్వహిస్తే వెంటనే ఆ ప్రదేశాన్ని ఖాళీచేసి మరో ప్రదేశానికి వెళతారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ తెల్లవారుజామున 5 గంటల నుంచి 7 గంటల వరకూ ఈ కోడి పందేలను నిర్వహిస్తారు. దీని కోసం నగరంలోని వారే కాకుండా తెనాలి, రేపల్లె, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, అమరావతి తదితర ప్రాంతాలనుంచి కూడా పందెంగాళ్ళు వస్తున్నారంటే ఏస్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తుంటారు. ఐతే సంబంధిత అధికారులకు భారీ స్థాయిలో మామూళ్లు అందుతుంటాయని.. వారు ఎప్పుడు వచ్చేది ఎక్కడికి వచ్చేది కూడా నిర్వాహకులకు ముందే సమాచారం అందుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూదం, కోడిపందేల నిర్వహణపై నిఘాను పెంచి అమాయక ప్రజలు, కుటుంబాలు వీధిపాలు కాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సీసీ క్యాంప్‌లో విజ్ఞాన్ నిరుల క్యాడెట్ల ప్రతిభ



పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఇటీవల కేతనకొండలో జరిగిన ఎన్‌సీసీ క్యాంపులో విజ్ఞాన్ నిరుల కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఉత్తమ ప్రతిభను కనబరిచి వివిధ విభాగాల్లో పతకాలు సాధించారని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్యాంపులో జరిగిన పోటీలు త్రో బాల్‌లో ఆరుగురు క్యాడెట్లకు బంగారు పతకాలు, వాలీబాల్ రన్నర్స్ ఎనిమిది మందికి రజత పతకాలు, ఫైరింగ్‌లో ఒకరికి బంగారు పతకం, షటిల్‌లో ఇద్దరికి బంగారు పతకం, క్యాంపు సీనియర్‌కి ఆర్పీ డ్యూటీ నిర్వహించినందుకు ఒకరికి బంగారు పతకం లభించినట్లు తెలిపారు. కళాశాల అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ సీహెచ్ జ్యోతిప్రియ మాట్లాడుతూ క్యాంపులో ఆరు వందల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారని కళాశాల నుంచి 56 మంది పాల్గొన్నట్లు తెలిపారు. క్యాంప్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ లభించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన క్యాడెట్లను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందనలు తెలిపారు.

రయ్.. రయ్.. రివర్స్..!

సంక్రాంతి సంబరాల్లో ట్రాక్టర్ రివర్స్ పోటీలు



కాకుమాను: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండల కేంద్రం కాకుమానులో సోమవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు, మహిళలకు మోకు లాగే పోటీలు నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో నిర్వహించిన పోటీలలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

కనులపండువగా పుట్టలమ్మ తల్లి సంక్రాంతి సంబరాలు





ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు, వేషధారణలు

గుంటూరు రూరల్: నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామాల ఇలవేల్పు దేవత శ్రీగంటాలమ్మ శ్రీపుట్టలమ్మ తల్లి సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారి ఆభరణాలు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది అమ్మవారి ప్రసాదం లడ్డును వేలంలో పాడుకున్న వెంగళాయపాలెం గ్రామానికి చెందిన నరసింహారావు ఇంటి వద్ద నుంచి ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో ఆద్యంతం, తీన్మార్ డప్పులు, కర్రసాము, సంగీత కచేరి, కేరళ వాయిద్యాలతో, దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో భాగంగా గ్రామంలో ప్రజలు ఉత్సవ మూర్తికి వార్లు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. వెంగళాయపాలెం నుంచి ఊరేగింపుగా కాలేజీ సెంటర్, గొర్రెల మండి, నల్లపాడు, చల్లావారిపాలెం వరకు వేలాది మంది భక్తులు, కోలాటాల నడుమ కన్నుల పండువగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి మాట్లాడుతూ మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు, గ్రామోత్సవం జరుగుతోందని తెలిపారు.